క్లుప్తంగా

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ


సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దారుగా టీవీ.బ్రమణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌నాయుడు డిప్యూటీ కలెక్టరుగా ఉద్యోగోన్నతిపై చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్యవేడు నుంచి బదిలీపై సుబ్రమణ్యం ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ, భూసర్వే, భూపంపిణీ కార్యక్రమాలపై దృష్టి సారిస్తానన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం..రేణిగుంటకు చెందిన మనోహర్(45), శ్రీనివాసులు(38) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఇసుతాగేలి బీసీ కాలనీ రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీకి ఒకవైపు పక్కగా తగిలి పడ్డారు. స్వల్పగాయాలవడంతో వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పెట్టాలని ఎంఈఓ రవీంద్రనాథ్ సూచించారు. శనివారం ఆయన కంచనపుత్తూరు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. వంటగది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని పెన్నగడం వద్ద శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

ఏర్పేడు: మండలంలోని కోబాకలో శనివారం సర్పంచ్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో దోమల నివారణకు గ్రీన్ అంబాసిడర్లు ఫాగింగ్ చేశారు. దోమల మోత పెరగడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వీధులు, ఇళ్లు, మురుగు కాలువల్లో ఫాగింగ్ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చెంగల్రాయులు, పంచాయతీ కార్యదర్శి లోకముని తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ


భూసార పరీక్షల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి భూసార పరీక్షలపై శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు మణి, సత్యవేడు డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి మాట్లాడారు. భూసార పరీక్షలు ఎందుకు చేసుకోవాలి? ఎలా చేసుకోవాలి? దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంతేకాక పలు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే క్షేత్రస్థాయిలో భూసార పరీక్షలను ఎలా చేయాలో లక్ష్మీపురం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి సుహార్‌లత, ఏఈఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రుయా చిన్నపిల్లల విభాగంలో ఆకస్మిక తనిఖీలు

తిరుపతి తుడా: రుయా చిన్న పిల్లల ఆస్పత్రిలోని న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్ (అక్షయ పిల్లల ఆరోగ్య పునర్జీవ కేంద్రం)లో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ నివాస్ ఆదేశాల మేరకు ఆయన పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం వార్డుల్లో సందర్శించి పిల్లలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ లక్ష్మణ్‌నాయక్, ఏఆర్ఎంఓ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతిరెడ్డి, డీఈఓ డాక్టర్ శాంతకుమారి పాల్గొన్నారు.

సమన్వయంతో సర్వే పూర్తిచేద్దాం

-సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


కొండలచెరువు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేసి 'నువ్వే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్' ప్రజా సర్వే కార్యక్రమాన్ని సమన్వయంతో వంద శాతం పూర్తి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం సాయంత్రం కొండలచెరువులో నిర్వహించిన మెగా సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను ఇనుమడింపచేసేందుకు జగనన్న ప్రతిష్టాత్మకంగా మెగా సర్వే చేయాలని ఆదేశించారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి గత ప్రభుత్వ వైఫల్యాలను, జగనన్న సంక్షేమ పాలనలో కలిగిన మేలును వివరిస్తూ వారి సెల్ ఫోన్ల నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాలని అన్నారు. మిగిలిన ఐదు రోజుల్లో నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంపీపీలు, మండల పార్టీ కన్వీనర్లు ప్రజా ప్రతినిధులను సమన్వయం చేస్తూ తమ పరిధిలోని ఇళ్లలో మెగా సర్వేను పూర్తి చేయించాలని సూచించారు. రాష్ట్రంలోని నియోజకవర్గం మొదటి స్థానంలో నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి యజమానుల అనుమతితో స్టిక్కర్లను అతికించి, వారి ఫోన్ల నుంచి మిస్డ్ కాల్ ఇచ్చారు. ఇటుకల తయారీకి మట్టిని తమ పొలాల నుంచి తరలించుకున్నా మైనింగ్ శాఖాధికారులు వేలకు వేల రూపాయలు జరిమానా విధిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆదిమూలం హామీ ఇచ్చారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, సర్పంచ్ భూపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు పళనిరెడ్డి, నటరాజరెడ్డి, గోపి, కుమార్, అర్జున్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, బాలిరెడ్డి, వెంకటయ్య, కన్నెప్పరెడ్డి, దొరస్వామి, నటరాజ్, వెంకటేశులు, గృహసారథులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ల ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దివిస్ ల్యాబరేటరీస్ అధినేత మురళి వితరణతో ఐదు ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు శనివారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, భక్తుల సౌకర్యార్థం 25వ తేదీన ప్లాంట్లు సిద్ధం చేసి, 27న శ్రీకాళహస్తీశ్వరస్వామివారి జలప్రసాదం అని నామకరణం చేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శివకిషోర్‌కుమార్, మురళి, ప్రతాప్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం


గ్యాస్ సిలిండర్ నుంచి వచ్చే మంటను తడి దుప్పటితో ఆర్పుతున్న మహిళ

సత్యవేడు: అగ్ని ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సత్యవేడు అగ్నిమాపక అధికారి పి.రాజయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం బీసీ కాలనీలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్యాస్, అగ్ని, విద్యుత్ తదితర ప్రమాదాలు, వాటి నుంచి అప్రమత్తంగా ఎలా బైటపడాలో ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయితే నీళ్లతో తడిపిన దుప్పటిని సిలిండర్ చుట్టూ కప్పి మంట ఆర్పే ప్రయత్నం చేయాలని ఫైర్ ఆఫీసర్ చేయాలని చెప్పారు. సిలిండర్ నుంచి గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. దెబ్బతిన్న స్విచ్‌లు, అతుకులు గల వైర్లు వాడవద్దన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ వలే, డీఓ గోవిందరాజులు, డీఓపీ సుబ్రమణ్యం, ఎఫ్ఎం కాలచంద్రన్, సీహెచ్ రమణమూర్తి, జీ.నరేష్, ఎం.దామోదరం, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్షలు

చంద్రగిరి: జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) 2023–24 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి ఆదివారం ఉదయం ప్రవేశ పరీక్షలు జరగనున్నట్లు చంద్రగిరి గురుకుల పాఠశాల (ఉదయ మాణిక్యం) ప్రిన్సిపల్ గీతాంజలి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9000783185 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

దళిత ద్రోహులు బాబు, లోకేష్

తిరుపతి కల్చరల్: గత తెలుగుదేశం పాలనలో దళితుల పట్ల వివక్ష చూపుతూ వారిపై దాడులు చేయడమేకాక దళిత జాతిని హేళన చేసి అవమానించిన దళిత ద్రోహులు చంద్రబాబు, లోకేష్ అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ జయంతి రోజు నారా లోకేష్ దళితులు ఏ మి పీకారని హేళ చేసే వ్యాఖ్యలు చేయడం దు ర్మార్గమన్నారు. దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని గతంలో చంద్రబాబునాయుడు దళితల పట్ల వివక్ష చూపారని తెలిపారు. అంతేకాక గత ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం బిల్లు అసెంబ్లీకి వస్తే నాడు చంద్రబాబు అసెంబ్లీకి గైర్హాజరవడం దళితులంటే వివక్ష కాదా అని ప్రశ్నించారు. దళితులంటే గిట్టని టీడీపీ చంద్రబాబు, లోకేష్ దళితులపై విచక్షణారహితంగా వ్యాఖ్యలు చేయడం మంచిదికాదని, ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలను మానుకోవాలని లేని పక్షంలో యావత్ దళిత జాతి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం


ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్న సేవ్ ద చిల్డ్రన్స్ సంస్థ ప్రతినిధులు

వరదయ్యపాళెం: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సేవ్ ద చిల్డ్రన్స్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కిరణకుమారి అన్నారు. శనివారం కారిపాకంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరికీ మంచి ఆరోగ్యం, సంరక్షణ ఉన్నప్పుడే పూర్తిస్థాయి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు వీలవుతుందన్నారు. అందుకు తగిన విధంగా రోజువారీ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, వాకింగ్, వ్యాయామం, యోగా చేయడం అలవరచుకోవాలన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు 6నెలలకోసారి పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సచివాలయ కార్యదర్శి శేఖర్, డిజిటల్ అసిస్టెంట్ స్వప్న, సేవ్ ద చిల్డ్రన్స్ ప్రతినిధి తులసి తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకారంలో శనీశ్వరస్వామి


ప్రత్యేకాలంకారంలో వెంకటేశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి శనివారం వైభవంగా ప్రత్యేక పూజలు, కలశ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తైలాభిషేకం, పలు రకాల అభిషేకాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి..

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీవెంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన స్వామివారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

శరవేగంగా గంగమ్మగుడి మాస్టర్‌ప్లాన్ రోడ్డు


మాస్టర్‌ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్

తిరుపతి తుడా: గంగజాతర వేడుకలను దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 30లోగా గంగమ్మగుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పూర్తిచేయనున్నట్లు నగర మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌తో కలిసి శనివారం ఆమె మాస్టర్‌ప్లాన్ రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈనెల 30వ తేదీలోపు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు ఆదేశించారు. మేయర్ మాట్లాడుతూ తిరుపతి నడిబొడ్డున ప్రజా రవాణాకు అత్యంత సౌకర్యవంతంగా ఉండేలా ఈరోడ్డును చేపట్టినట్లు చెప్పారు. భూమన అభినయ్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యకు కొంతమేర అయినా శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో నగరంలోని పలు కూడళ్లు, రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నగరపాలక అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, వైఎస్సార్ సీపీ నేతలు దొడ్డరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉదయ్ వంశీ, తులసి యాదవ్, భరణి యాదవ్, చింతా రమేష్, నగరపాలక టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు శారదంబ, సాయిలీల పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

చంద్రగిరి: మామిడి తోటలకు సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధించవచ్చునని మండల ఉద్యానశాఖ అధికారిణి శైలజ అన్నారు. శనివారం ఆమె మండలంలోని భీమవరం, ఐతేపల్లి, కల్‌రోడ్‌పల్లి, ముంగిళిపట్టు, చంద్రగిరిలోని మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మామిడిలో పూత విడతలుగా రావడం వలన ప్రస్తుతం కాయ ఉసిరి, నిమ్మ, బత్తాయికాయ పరిమాణాల్లో ఉందన్నారు. సస్య రక్షణ పద్ధతులు పాటించడం వలన మంచి దిగుబడి పొందడం సాధ్యమని ఆమె రైతులకు తెలిపారు.

ఆలయ మహాసంప్రోక్షణ ఏర్పాట్లపై సమీక్ష

తిరుమల: మన్యంజిల్లా, సీతంపేటలో ఏప్రిల్ 29 నుంచి మే 4వ తేదీ వరకు జరగనున్న శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ ఏర్పాట్లపై టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం సమీక్ష నిర్వహించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం జరిగిన ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ మహాసంప్రోక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రచార రథాల ద్వారా చుట్టుపక్కల గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. డెప్యూటేషన్ సిబ్బందికి బస ఏర్పాట్లు చేయాలని, భక్తులకు అవసరమైన తాగునీరు, అన్న ప్రసాదాలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయం, కల్యాణ మండపం వద్ద విద్యుద్దీపాలంకరణ చేపట్టాలన్నారు. భక్తులు ఎండ వేడికి ఇబ్బంది పడకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల్లో విచ్చేసిన భక్తుల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఆలయం వద్ద సుందరీకరణ, విద్యుద్దీపాలంకరణ చేపట్టాలన్నారు. సమీక్షలో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, గోవిందరాజన్, సుబ్రమణ్యం, ఎస్ఈ ఎలక్ట్రికల్స్ వెంకటేశ్వర్లు, ఈఈ శ్రీవేణుగోపాల్ వీజీఓ శ్రీమనోహర్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశుసంచార వాహన వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న వ్యవసాయ సలహామండలి చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి

సత్యవేడు: మండలంలోని పాడి రైతులు పశు సంచార వాహన వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు కే.శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. శనివారం వ్యవసాయ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పశువులకు ప్రమాదం సంభవిస్తే 1962కు ఫోన్ చేస్తే పశుసంచార వాహనంతో పాటు డాక్టర్ గ్రామానికి చేరుకుని చికిత్స చేస్తారన్నారు. వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా రాని రైతులు తమ పేర్ల వివరాలు, ఆధార్ కార్డును ఆర్‌బీకే సిబ్బందికి అందజేసి నమోదు చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్, ఈకేవైసీ మండల పరిధిలో 284మంది చేసుకోలేదన్నారు. నెలాఖరు లోపు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఏఏ స్వర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ ఆర్.సుందరం, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'


శ్రీకాళహస్తి :సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి


బీఎన్‌కండ్రిగ : కొత్తపాళెంలో..


ఏర్పేడు : పాతవీరాపురంలో..


వరదయ్యపాళెం : బత్తలవల్లంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం గ్రామపంచాయతీ కొత్తపాళెంలో శనవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సుబ్బరత్నమ్మ గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. వివిధ పథకాలతో తాము పొందిన లబ్ధిని ఆయా కుటుంబాల వారు చెప్పడమే కాకుండా మరోసారి జగనన్నకే తాము మద్దతు ఇస్తామని ప్రకటించారు. వారి ఇళ్లకు జగనన్న స్టిక్కర్లను అతికించి, సెల్‌ఫోన్ నుంచి మిస్డ్ కాల్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరిప్రసాద్, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గురవారెడ్డి, ఎండీపుత్తూరు, ఇసుకతాగేలిలో సర్పంచులు మోహనప్రియ, గురవమ్మ ఆధ్వర్యంలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేశారు. వారి ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు అంటించారు.

34వ వార్డులో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని 31వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి నిర్వహించారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తుండడంతో పలు రాష్ట్రాల వీటిపై ఆసక్తి చూపుతున్నాయన్నారు. ప్రజలు మరోసారి సంక్షేమ సారథి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మధురెడ్డి, కరుణాకర్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కార్తీక్, చందు, లోకేష్, దినేష్, బాలాజీ, మహమ్మద్ రఫీ, యాకూబ్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ చిన్నా మాట్లాడారు. బత్తలవల్లం గ్రామ పంచాయతీ వితయ్యపాళెం, చెదులుపాకం, బీసీకాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజల అనుమతితో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ శీనురెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, పంచాయతీ కన్వీనర్ గిరిరెడ్డి, సర్పంచ్ లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.